# పేదలకు సేవ చేసేందుకే రాజకీయాల్లోకి వచ్చా..

- నేను బతికున్నంత వరకు ఆడబిడ్డల పెండ్లిళ్లు చేస్తా..
- లక్ష ఎకరాలకు సాగునీరు అందించా..
- స్థోమతలేని ఆడపిల్లల చదువు, పెండ్లి బాధ్యత తీసుకుంటా..
- మహిళా యువ గర్జనలో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి


మహిళా యువగర్జనలో మాట్లాడుతున్న నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబర్ 27(నమస్తే తెలంగాణ) : చిన్నతనం నుంచి కష్టాలు, కన్నీళ్లను దగ్గరుండి చూశానని.. ఆత్మహత్య చేసుకునేందుకు రైలుకు ఎదురుగా వెళ్లానని.. కానీ పుట్టడం పిరికివాడిగా చావడానికి కాదని గుర్తించి ఓ బట్టల షాపులో పనికి కుదిరి కష్టపడి ఈ స్థాయికి వచ్చి పేదలకు ఇలా సేవ చేయడం తనకు దొరికిన అదృష్టంగా భావిస్తున్నానని నాగర్‌కర్నూల్ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని జెడ్పీ మైదానంలో మహిళ యువ గర్జన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మర్రి మాట్లాడుతూ.. తాను చిన్నప్పుడే కటిక పేదరికం అనుభవించానన్నారు. తన తండ్రి వ్యవసాయం చేసేందుకు చేసిన అప్పును తీర్చేందుకు వలస వెళ్లానన్నారు. నాలాగే ఎంతో మంది ప్రజలు అడ్డా కూలీలుగా, వలస కూలీలుగా నాడు పని చేశారన్నారు. సీఎం కేసీఆర్ సహకారకంతో ని యోజకవర్గంలో ఎంజీకేఎల్ఐని పూర్తి చేయించి నియోజకవర్గంలో రెండు పంటలు పండుతున్నాయని, లక్ష ఎకరాల్లో భూములు సాగవుతున్నాయన్నారు. రాజకీయాల్లో వచ్చాక నేను ఎక్కడా తప్పు చేయలేదన్నారు. నాగర్‌కర్నూల్‌ను జిల్లాను, మెడికల్ కాలేజీని ఏర్పాటు చేశానని, ఆడ పిల్లల పెండ్లిళ్లకు ఆర్థిక సాయం చేశానని, రూ.5కే భోజనం అందిస్తున్నానన్నారు. ఎవరైనా ఆడ పడుచులు తమ ఆడ పిల్లలుండి చదివించే స్థోమత లేకుంటే చదివించి పెండ్లిళ్లు చేయించే వరకు మేనమామగా నేను బాధ్యత తీసుకుంటానన్నారు. తొమ్మిదేండ్లలో ఎంతో అభివృద్ధి చేశానన్నారు. కేవలం డబుల్ బెడ్రూం ఇండ్లు మాత్రమే ఇవ్వలేకపోయానని, డిసెంబర్ 10వ తేదీన అందరికీ ఇస్తానని, నా సొంత డబ్బులతోనైనా ఇండ్లు కట్టించే బాధ్యత తీసుకుంటానన్నారు. ఎంతో అభివృద్ధి చేసి, సేవలు చేస్తున్నా కొందరు తనని అనకూడని మాటలు అంటున్నారన్నారు. మీకు చేతులెత్తి దండం పెడుతున్నానని, ఎవరూ ఆ మాటలను, అబద్ధాలను నమ్మవద్దన్నారు. నేను బతికున్నంత వరకు నా చర్మాన్ని వలిచైనా చెప్పులు కుట్టించి సేవ చేసుకునే బాధ్యత నాదన్నారు. కొందరి మాటలతో నాకు ఎంతో బాధ కలుగుతుందన్నారు. పేదలకు చేసేందుకు మీ ముందుకు వచ్చానన్నారు. గులుగుడు, గులుగుడే...అలుగుడు అలుగుడే... గుద్దుడు గుద్దుడేనంటూ... మీరంతా తనను దీవించి, 30వ తేదీన 3వ నెంబర్ కారు గుర్తుకు ఓటేసి తనను భారీ మెజార్టీతో గెలిపించాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు మర్రి సతీమణి జమున మాట్లాడుతూ రాజకీయాలు సేవ చేసేందుకే చేస్తున్నామన్నారు. తన భర్త వ్యాపారం, కుటుంబం వదిలి రోజూ మీ మధ్యనే ఉంటున్నారన్నారు. ఇంట్లో ఉన్నా నాగర్‌కర్నూల్‌లో ఏ ఊరిలో, ఎవరికి ఏ సమస్య ఉందో, ఏం పని చేయాలా అంటూ ఆలోచిస్తుంటారన్నారు. మరోసారి మీ మర్రి అన్నను ఎమ్మెల్యేగా గెలిపించాల్సిన బాధ్యత ఆడపడుచులు, ప్రజలందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ జక్కా రఘునందన్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి బైకని శ్రీనివాస్ యాదవ్, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ హన్మంతరావు, నాగం శశిధర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ కల్పన, జెడ్పీటీసీ శ్రీశైలం, ఎంపీపీ శ్రీనివాస్‌గౌడ్‌తో పాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, భారీ ఎత్తున మహిళలు పాల్గొన్నారు.


మహిళా యువగర్జనకు భారీగా హాజరైన మహిళలు


అమ్రాబాద్ ప్రచారంలో మాట్లాడుతున్న ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

# భస్మాసుర హస్తానికి ప్రజలు బలి కావద్దు

- కాంగ్రెస్‌వి వారంటీ లేని గ్యారెంటీలు
- రైతుల నోట్లో మట్టికొట్టారు
- ఎన్నికల ప్రచారంలో ప్రభుత్వ విప్ గువ్వల బాలరాజు

అమ్రాబాద్, నవంబర్ 27 : కాంగ్రెస్ భస్మాసుర హస్తానికి ప్రజలు బలి కావద్దని ప్రభుత్వ విప్, అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు అన్నారు. అమ్రాబాద్, పదర మండలాలలో సోమవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా బీఆర్ఎస్ నాయకులతో కలిసి ర్యాలీ, రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు ప్రజలు కోలాటాలు, పూలతో ఘన స్వాగతం పలికారు. కోడోనిపల్లి గ్రామంలో హనుమాన్ ఆలయంలో పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ సారథ్యంలో తెలంగాణ రాష్ట్రాన్ని దేశంలో నెంబర్‌వన్‌గా నిలిపిన ఘనత మనదన్నారు. సంక్షేమ పథకాలు అమలుతో పాటు 24గంటల విద్యుత్, మిషన్ భగీరథ, ప్రాజెక్టుల నిర్మాణం చేసిన ప్రభుత్వం బీఆర్ఎస్ అని ఆయన గుర్తుచేశారు. అచ్చంపేట నియోజకవర్గంలో అన్ని మండలాలతో పాటు అమ్రాబాద్, పదర మండలాలకు ప్రతి గుంటకు సాగునీరందించడమే నా జీవతాశయమని ఆయన అన్నారు. కాంగ్రెస్ నేతలు హ్యాట్రిక్ ఓటమిని చవి చూస్తారని పేర్కొన్నారు. డిసెంబర్ 3న వచ్చే ఫలితాలతో బీఆర్ఎస్ చారిత్రక విజయాన్ని నమోదు చేసి అచ్చంపేట గడ్డపై గులాబీ జెండాను ఎగురవేయడం తథ్యం అన్నారు. బీఆర్ఎస్ పార్టీకి ప్రజలు ఇస్తున్న మద్దతు చూసి కాంగ్రెస్ ఓర్వలేక భౌతిక దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ చెబుతున్న గ్యారెంటీ పథకాలకు వారంటీ లేవని వారు ఎప్పుడు ఏ మాట మార్చుతారో ప్రజలకు అర్థం కావడం లేదన్నారు. ఈ ప్రాంతం అని చెప్పుకునే కాంగ్రెస్ నాయకులు వైద్య వృత్తిలో ఉండి కూడా ఇక్కడి ప్రజలు ఎన్నడూ గుర్తుకు రారని, కేవలం ఓట్ల సమయంలోనే గుర్తుకు రావడం వారి సవతి ప్రేమకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. నన్ను ఇంతగా ఆదరిస్తున్న నా నల్లమల ప్రజలకు నాలో ఊపిరున్నంత కాలం సేవ చేసుకుంటానని ప్రకటించారు. రైతులకు రైతు బంధు వస్తే తమకు ఓట్లు వేయరని కాంగ్రెస్ అధినేత రేవంత్‌రెడ్డి ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేసి రైతుల నోట్లో మట్టి కొట్టారని విమర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు ఆయన సమక్షంలో కాంగ్రెస్‌ను వీడి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరు తమ అమూల్యమైన ఓటును కారు గుర్తుకు వేయాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మన్ననూర్ సర్పంచ్ శ్రీరాంనాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ఎర్ర నర్సింహ, జెడ్పీటీసీ రాంబాబునాయక్, వైస్ ఎంపీపీ వరుణ్‌కుమార్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ గోళి శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు ఎల్లయ్య, ఎంపీటీసీలు సునీతశ్రీను, ఎల్లమ్మశ్రీను, నారయ్య, రమేశ్, విష్ణుమూర్తి, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, గ్రామస్తులు ఉన్నారు.

# రైతుల నోట్లో మట్టి కొట్టిన కాంగ్రెస్

- కర్షకులు బాగుపడితే హస్తం నాయకులకు కడుపుమంట
- 30న జరిగే ఎన్నికల్లో వారికి తగిన గుణపాఠం చెప్పాలి
- కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి పిలుపు
- హాజరైన ఎంపీ రాములు


ఎల్లూరులో ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డిపై పూలవర్షం కురిపిస్తున్న పార్టీ శ్రేణులు, ప్రజలు

కొల్లాపూర్, నవంబర్ 27: రైతు బంధు డబ్బులు ఖాతాల్లో పడకుండా రైతుల నోట్లో కాంగ్రెస్ మట్టికొట్టిందని కొల్లాపూర్ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి ఆరోపించారు. రైతులు బాగుపడుతుంటే హస్తంపార్టీ నాయకులకు కడుపు మండుతుందని అలాంటి వారికి ఈ నెల 30న జరిగే ఎన్నికల్లో ఓటుతో బుద్ధిచెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. సోమవారం కొల్లాపూర్ మండలంలో తాళ్లనర్సింహాపూర్, ఎల్లూరు, మొలచింతపల్లి గ్రామాల్లో ఎంపీ రాములుతో కలిసి ఎమ్మెల్యే బీరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వారికి ఆయా గ్రామాల్లో ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు, పూలవర్షం కురిపించారు. ఈ సందర్భంగా బీరం మాట్లాడుతూ రైతులకు రైతు బంధు డబ్బులు ఖాతాల్లో పడితే తమ పప్పులు ఉడకవని భావించి కాంగ్రెస్ నాయకులు కుట్రలు పన్ని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేసి అడ్డుపడ్డారని ఆరోపించారు. రైతులకు మూడుగంటల కరెంట్ చాలని, రైతులు 10హెచ్‌పీ మోటర్లు వాడాలని ఓ వైపు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి మాట్లాడుతుంటే, మరోపక్క ధరణికి బదులుగా భూమాతను తీసుకొస్తామని మల్లు భట్టి విక్రమార్క చెప్పడం చూస్తే రైతులను ఆగం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే వ్యవసాయం ఆగమాగం కానున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. గత ఎన్నికల్లో తాళ్ల నరసింహాపురంను కొల్లాపూర్ మున్సిపాలిటీ నుంచి వేరు చేసి ప్రత్యేక గ్రామ పంచాయతీగా చేస్తానని ప్రజలకు ఇచ్చిన హామీని నేరవేర్చినట్లు గుర్తు చేశారు. గతంలో దౌర్జన్యాలు,అరాచకాలు ఎక్కువ ఉండేవని తాను ఎమ్మెల్యేగా వచ్చాక ప్రశాంతమైన కొల్లాపూర్ ఉందని, మళ్లీ దౌర్జన్యాలకు కుట్రలకు తావు లేకుండా చూడాలని ఆయన ఓటర్లకు విజ్ఞప్తి చేశారు. కొందరు నాయకులు అధికారం రాకముందే ఉద్యోగులు, వ్యాపారులు, కాంట్రాక్టర్లను మీ అంతు చూస్తామంటూ బెదిరిస్తున్నారని, అలాంటి వారికి మీ ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పాలని సూచించారు. రైతుల సంక్షేమాన్ని కోరే బీఆర్ఎస్ ప్రభుత్వం కావాలా.. లేక రైతులను గోస పెట్టే కాంగ్రెస్ కావాలో తేల్చుకోవాల్సిన సమయం వచ్చిందని, రైతును రాజుగా నిలపాలంటే మరోసారి బీఆర్ఎస్‌ను ఆదరించి కారు గుర్తుపై మీ అమూల్యమైన ఓటును వేసి ఎమ్మెల్యేగా భారీ మెజార్టీతో తనను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు రంగినేని అభిలాష్‌రావు, గౌరారం వెంకట్‌రెడ్డి, సింగిల్ విండో వైస్ చైర్మన్ హుజూర్‌శ్రీనివాస్‌యాదవ్, సర్పంచ్ బండి లక్ష్మీదేవమ్మ, ఎంపీటీసీ శంకర్‌నాయక్, నాయకులు చంద్రశేఖర్‌శెట్టి, సుదర్శన్‌గౌడ్, సుదర్శన్‌చారి తదితరులు పాల్గొన్నారు.


జంగారెడ్డిపల్లిలో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌కు బోనాలతో స్వాగతం పలుకుతున్న మహిళలు

# మళ్లీ వచ్చేదిబీఆ ర్ఎస్ ప్రభుత్వమే..

- రైతులకు అండగా నిలిచింది సీఎం కేసీఆరే
- కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్

కల్వకుర్తి, నవంబర్ 27 : రాష్ట్రంలో ముచ్చటగా మూడోసారి అధికారంలోకి బీఆర్ఎస్ ప్రభుత్వం రానుందని కల్వకుర్తి బీఆర్ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం కల్వకుర్తి మండలంలోని తిమ్మరాశిపల్లి, జంగారెడ్డిపల్లి, ఎల్లికల్, ఎల్లికల్ తండా, ముకురాల, గుండూర్, లింగసానిపల్లి, రఘుపతిపేట, రామగిరి, తుర్కలపల్లి, తర్నికల్, తర్నికల్ తండా, తాండ్ర గ్రామాల్లో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమాల్లో జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ కల్వకుర్తికి కేఎల్ఐ ద్వారా సాగునీరు తీసుకురావడమే కాకుండా, ప్రతి గ్రామానికి మిషన్ భగీరథ ద్వారా తాగునీరు అందిస్తున్న ఘనంగా బీఆర్ఎస్ ప్రభుత్వానికే దక్కిందని చెప్పారు. రైతులకు సకాలంలో ఎరువులు, విత్తనాలు, రైతుబంధు, రుణమాఫీ పథకాలను అమలు చేసి రైతుకు అండగా నిలిచింది సీఎం కేసీఆర్ అని గుర్తు చేశారు. రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన బీఆర్ఎస్ పార్టీని ఎట్టి పరిస్థితుల్లో విస్మరించవద్దని సూచించారు. కాంగ్రెస్, బీజేపీ నాయకుల కల్లబొల్లి మాటలు నమ్మితే రాష్ట్ర భవిషత్తు అంధకారంగా మారుతుందని హెచ్చరించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ మరోసారి ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రమంతా సుభిక్షంగా ఉంటుందని అందరూ బీఆర్ఎస్ కారు గుర్తుకు ఓటు వేసి భారీ మెజార్టీతో తనను ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆయా గ్రామాలకు వెళ్లిన ఎమ్మెల్యేకు ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఎంపీపీ మనోహర, మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మార్కెట్ చైర్మన్ విజయ్ గౌడ్, వైస్ ఎంపీపీ గోవర్ధన్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌యాదవ్, కౌన్సిలర్లు రవి, సూర్యప్రకాశ్‌రావు, సర్పంచులు పద్మ, నరేందర్‌రెడ్డితోపాటు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.